RNI No :TELTEL2022/83073

# వేద న్యూస్

దినపత్రిక

వరంగల్ | గురువారం | పేజీలు : 4
సంపుటి : 3, సంచిక : 198 | జులై 03, 2025 | వెల : రూ.3-00




## రైల్వే గేటు..తప్పని పాట్లు..!

3లో..

- పేదల కోసం సర్కారీ ఆస్పత్రుల్లో ఏడాదిలో నెల వర్క్ చేయండి
- కార్పొరేట్ హాస్పిటల్స్ వైద్యులకు సీఎం రేవంత్‌రెడ్డి విజ్ఞప్తి
- డాక్టర్ నాగేశ్వరరెడ్డికి భారతరత్న ఇవ్వాలని కోరిన ముఖ్యమంత్రి
- బంజారాహిల్స్‌లో ఏఐజీ ఆసుపత్రి ప్రారంభం



# వన్ మంత్ రిక్వెస్టు




**వేద న్యూస్, హైదరాబాద్ ప్రతినిధి :**

కార్పొరేట్ ఆసుపత్రుల్లో పనిచేస్తున్న వైద్యులు ఏడాదిలో కనీసం ఒక నెల రోజుల పాటు ప్రభుత్వ ఆసుపత్రుల్లో నిరుపేదలకు సేవలు అందించే ఆలోచన చేయాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి విజ్ఞప్తి చేశారు. ఒక సామాజిక బాధ్యతగా సామాన్య ప్రజలకు సేవలు అందించడం వల్ల వైద్య వృత్తిలో గొప్ప అనుభూతి, ఆత్మ సంతృప్తి లభిస్తుందని అన్నారు. బుధవారం హైదరాబాద్ బంజారాహిల్స్‌లో ఏఐజీ నెలకొల్పిన నూతన ఆసుపత్రిని ముఖ్యమంత్రి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, కార్పొరేట్ రంగంలో ఉన్న వైద్యులు ప్రభుత్వ సేవలు అందించాలంటే అనుసంధానం చేయడానికి వీలుగా ఇప్పటివరకు సరైన వేదిక లేదని, అలాంటి వ్యవస్థను ఏర్పాటు చేయాలని అధికారులకు సూచించినట్టు చెప్పారు. "అమెరికాలో స్థిరపడిన మన రాష్ట్రానికి చెందిన డాక్టర్లు ఎప్పుడైనా ఇక్కడికి వచ్చినప్పుడు వారు సేవలు అందించాలంటే అందుకు తగిన ప్లాట్‌ఫామ్ ఏదీ లేదు. వారిక్కడ ఉన్న సమయంలో వారి సేవలు అందించాలనుకుంటే అందుకు అనుగుణంగా ఒక వేదిక ఏర్పాటు చేయాలని అధికారులకు సూచించామని తెలిపారు. ప్రభుత్వ ఆసుపత్రికి వెళితే ప్రాణాలు పోతాయన్న అభిప్రాయం నుంచి దూరం చేయాలన్న ఆలోచనతో కార్పొరేట్‌కు ధీటుగా ప్రభుత్వ రంగంలో వైద్య సేవలు అందించాలన్న లక్ష్యంతో ప్రభుత్వం పనిచేస్తోంది. అందులో భాగంగానే వందేళ్ల ఉస్మానియా ఆసుపత్రికి 30 ఎకరాల స్థలం కేటాయించి రూ.3

మిగతా 4వ పేజీలో..



నీటి వనరుల సంరక్షణకు

## పకడ్బందీ చర్యలు

**- కలెక్టర్ సందీప్ కుమార్ ఝా**

**వేద న్యూస్, తంగళ్ళపల్లి :**

జిల్లాలో నీటి వనరుల సంరక్షణకు పకడ్బందీ చర్యలు తీసుకోవాలని కలెక్టర్ సందీప్ కుమార్ ఝా ఆదేశించారు. దేశాయిపల్లి కొత్తచెరువు, కట్ట పరిసరాలను బుధవారం ఉదయం కలెక్టర్ సందీప్ కుమార్ ఝా పరిశీలించారు. స్థానిక నక్కవాగు నుంచి దేశాయిపల్లి కొత్తచెరువులోకి వచ్చే ఫీడర్ చానల్ లో డీ సిల్టింగ్ పనులకు ప్రతిపాదనలు సిద్ధం చేయాలని సూచించారు. నీటి వనరుల సంరక్షణకు పకడ్బందీ చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఈ పర్యటనలో డిస్ట్రిక్ట్ ఇరిగేషన్ ఆఫీసర్ కిషోర్, డివిజన్-7 ఈ.ఈ. ప్రశాంత్, డీ.ఈ.ఈ. సత్యనారాయణ, సాగర్ తదితరులు ఉన్నారు.

మురళిని పిచ్చాస్పత్రిలో

## చేర్పించాలి



**- బీజేపీ నేత ఎర్రబెల్లి ప్రదీప్‌రావు**

**వేద న్యూస్, వరంగల్:**

ఎర్రబెల్లి ఇంట్లో పుట్టిన వారందరూ ఎర్ర బల్లులు అని కాంగ్రెస్ నేత, మాజీ ఎమ్మెల్సీ కొండా మురళీధర్‌రావు చేసిన కామెంట్స్‌పై బీజేపీ నేత, వరంగల్ అర్బన్ బ్యాంక్ చైర్మన్ ఎర్రబెల్లి ప్రదీప్‌రావు తీవ్రస్థాయిలో మండిపడ్డారు. మురళి మాటలను ఖండిస్తూ బుధవారం ఓ ప్రకటన విడుదల చేశారు. మంత్రి కొండా సురేఖ కొత్తవాడకు చెందిన ఓ మహిళను గతంలో బూతులు తిట్టిన విషయం మరిచారా? అని అడిగారు. కొండా మురళి.. ఓ మైనార్టీ నాయకుని మతం పేరుతో అవమానకరంగా బూతులు తిడుతూ బెదిరించి కించపరిచిన విషయం

మిగతా 4వ పేజీలో..

- జెడ్పీహెచ్ఎస్ కోసం 2016లో భూములు కోల్పోయిన బాధితులు
- బదులుగా 2 గుంటల భూమి, ఇల్లు కట్టిస్తామని అప్పటి మంత్రి హామీ
- 9 ఏండ్లుగా ఎదురుచూపులు.. తమకు న్యాయం చేయాలని వేడుకోలు
- అధికారుల చుట్టూ తిరిగి తిరిగి అలసిపోయామంటూ ఆగ్రహం
- స్కూల్ ఎదుట వంటసామగ్రితో బాధితుల నిరసన
- న్యాయం చేసే వరకు అక్కడే ఉంటామని వెల్లడి



# న్యాయం చేయరూ..!

**వేద న్యూస్, కమలాపూర్:**

హనుమకొండ జిల్లా కమలాపూర్ మండలకేంద్రంలో 2016లో జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాల భవనం నిర్మించారు. ఈ స్కూల్ బిల్డింగ్ కోసం భూములు సేకరించగా, అప్పుడు భూములు కోల్పోయిన బాధితులు.. బుధవారం పాఠశాల ఎదుటకు వచ్చి తమకు న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. తమకు న్యాయం జరిగే వరకూ అక్కడి నుంచి కదలబోమని భీష్మించుకుని కూర్చున్నారు. తమ ఇంటికి సంబంధించిన సామగ్రి అంతా ఇక్కడికే తీసుకొచ్చుకున్నామని, న్యాయం జరిగే వరకు ఇక్కడే ఉంటామని స్పష్టం చేశారు.

పూర్తి వివరాల్లోకెళితే.. కమలాపూర్ మండలకేంద్రానికి చెందిన తోట రజితకు 1.5 గుంటలు, మారం రేణుకకు 3 గుంటలు, కదారి మల్లమ్మకు 2 గుంటలు, శివజ్యోతికి ఇల్లు ఉండేవి. వాటిని.. పాత హై స్కూల్ భవనం కూలగొట్టి.. కొత్త హై స్కూల్ భవనం నిర్మించే క్రమంలో అదనంగా స్థలం అవసరం కావడంతో..పై వారందరి దగ్గర నుంచి భూమిని సేకరించారు. 2016లో ఈ ప్రక్రియ జరగగా, అప్పటి రాష్ట్ర ఆర్థిక శాఖ మంత్రి ఈటల రాజేందర్.. భూమి ఇస్తున్న వారందరినీ పిలిచి.. భూమిని ఇచ్చినందుకు దానికి బదులుగా గుంటకు రెండు గంటల భూమిని వేరే దగ్గర కేటాయిస్తామని, ఆ భూమిలో ఉచితంగా ఇల్లు కట్టించి ఇస్తామని, ఇంట్లో

మిగతా 3వ పేజీలో..

డబ్బాలు కిరాయికి ఇస్తే

## కఠిన చర్యలు




**- మున్సిపల్ కమిషనర్ మహమ్మద్ అయాజ్**
**- ఫ్లైఓవర్ కింద పలు డబ్బాల తొలగింపు**

**వేద న్యూస్, జమ్మికుంట:**

జమ్మికుంట పట్టణంలోని ఫ్లైఓవర్ బ్రిడ్జి కింద ఉన్న చిన్న దుకాణ సముదాయాలను మున్సిపల్ కమిషనర్ మహమ్మద్ అయాజ్ బుధవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన నిరుపయోగంగా ఉన్న దుకాణాలను తొలగించారు. కమిషనర్ మాట్లాడు

మిగతా 2వ పేజీలో..

## రైతును రాజు చేయడమే ప్రభుత్వ లక్ష్యం

**- రైతు భరోసా సంబరాలలో ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం**

**వేద న్యూస్, బోయినిపల్లి :**



రైతును రాజు చేయడమే కాంగ్రెస్ ప్రభుత్వ లక్ష్యం అని చొప్పదండి ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం అన్నారు. రాజన్న సిరిసిల్ల జిల్లా బోయినిపల్లి మండల కేంద్రంలో శివాజీ నగర్ హై స్కూల్ నుండి ర్యాలీగా అంబేద్కర్ చౌరస్తా వరకు వెళ్లి అంబేద్కర్ విగ్రహానికి పూలమాల వేశారు. రైతు భరోసా కార్యక్రమం విజయవంతమైన సందర్భంగా రైతులు,మహిళలు పార్టీ శ్రేణులతో కలిసి సీఎం రేవంత్ రెడ్డి,మంత్రి పొన్నం ప్రభాకర్ గౌడ్,ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం, చిత్రపటాల కు

మిగతా 2వ పేజీలో..

## ఆస్కి డైరెక్టర్ ను కలిసిన కమిషనర్

**వేద న్యూస్, వరంగల్ టౌన్:**



అడ్మినిస్ట్రేటివ్ స్టాఫ్ కాలేజ్ ఆఫ్ ఇండియా (ఆస్కి) డైరెక్టర్ డా.జనార్దన రెడ్డిని జిడబ్ల్యూఎంసీ కమిషనర్ చాహత్ బాజ్ పాయ్ బుధవారం హైదరాబాద్ లో మర్యాదపూర్వకంగా కలిసి పూల మొక్కను అందజేశారు. ఈ సందర్భం గా కమిషనర్ గా బాధ్యతలు చేపట్టిన నేపథ్యంలో డైరెక్టర్ కమిషనర్ కు శుభాకాంక్షలు తెలియజేశారు.అనంతరం ఇరువురు బల్దియా కు శానిటేషన్ విభాగంలో ఆస్కి సాంకేతిక సహకారం అందిస్తున్నందున అట్టి ప్రాజెక్ట్ ల గురించి చర్చించారు.

వేద న్యూస్

గురువారం, జులై 03, 2025

# నిబంధనలకు విరుద్ధంగా నిర్వహణ..!

**వేద న్యూస్, బోయినిపల్లి :**

రాజన్న సిరిసిల్ల జిల్లా బోయినిపల్లి మండలం వెంకట్రావుపల్లి గ్రామంలో వెంకట్రావుపల్లి నుండి కొత్తపేట వెళ్లే రోడ్డు వైపు ఉన్న బ్రాందీ షాపు పక్కన సిట్టింగ్ రూమ్ ల వద్ద ముందు మందుబాబులు విచ్చలవిడిగా వాహనాలు పార్కింగ్ చేసి అటుగా వెళ్లే వాహనదారులకు ఇబ్బంది కలిగించిన పట్టించుకునే నాథుడే లేరు. మందుబాబులు విచ్చలవిడిగా ఎక్కడపడితే అక్కడ బహిరంగ ప్రదేశాల్లో మద్యం సేవించడం పలు విమర్శలకు తావిస్తోంది. పట్టించుకోవాల్సిన అధికారులు పట్టించుకోకపోవడం వల్ల మందుబాబులు హల్చల్ చేస్తున్నారని స్థానికులు వాపోతున్నారు. బ్రాందీ షాప్ పక్కనే ఉన్న సిట్టింగ్ రూమ్ లో మందుబాబులకు పల్లీలు శనిగలు కాకుండా చికెన్ తలకాయ, బోటి వంటికూరలు వండి చపాతీ లతో పాటు ఎక్కువ రేటుతో అమ్మి సొమ్ము చేసుకుంటున్నారు. సిటింగ్ రూంలో అన్ని విధాలుగా సౌకర్యాలు కల్పిస్తున్నరు. అంతేకాకుండ బహిరంగ ప్రదేశాల్లో మద్యం సేవించడం వల్ల అటుగా వచ్చే పోయే వాళ్లకు ఇబ్బందిగా మారింది. మద్యం సేవించే మందుబాబులు రోడ్డుపై ఇష్టం వచ్చినట్లు పార్కింగ్ చేస్తున్న పట్టించుకునే నాథుడే లేడు. వాహనదారులకు ఇబ్బంది కలిగించే సిట్టింగ్ రూమ్ లపై ఎక్సైజ్ అధికారులు కాని పోలీస్ శాఖ గాని కఠిన చర్యలు తీసుకోవాలని వాహనదారులు కోరుతున్నారు.

# బీరప్ప స్వామి యువజన సంఘం కార్యవర్గం ఏకగ్రీవం

**వేద న్యూస్, బోయినిపల్లి :**



రాజన్న సిరిసిల్ల జిల్లా బోయినిపల్లి మండలం విలాసాగర్ గ్రామంలో బుధవారం బీరప్ప స్వామి యువజన సంఘం కార్యవర్గాన్ని బుధవారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. నూతన అధ్యక్షునిగా బొప్పెన రమేష్,ఉపాధ్యక్షుడిగా ఒల్లెం గంగరాజు,సెక్రెటరీగా బొప్పెన శ్రీకాంత్ లను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ కార్యక్రమంలో యువజన సంఘం మాజీ అధ్యక్షులు,కురుమ యాదవ సంఘం నాయకులు,ప్రజా ప్రతినిధులు పాల్గొన్నారు.

# ఆట దుస్తులు పంపిణీ

**వేద న్యూస్, ఇల్లంతకుంట :**



ఇల్లంతకుంట మండలం కందికట్కూర్ గ్రామంలోజిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు ఆనందరావు ఫౌండేషన్ చైర్మన్ వెంకటేశ్వరరావు సహకారంతో పాఠశాలలో ఉన్న 90 మంది విద్యార్థులకు ఆట దుస్తులు ఉచితంగా పంపిణీ చేయడం జరిగింది.ఈ సందర్భంగా ఆనందరావు ఫౌండేషన్ చైర్మన్ వెంకటేశ్వరరావు మాట్లాడుతూ విద్యార్థులు అన్ని రంగాలలో రాణించాలని, చక్కని క్రమశిక్షణతో, విలువలతో కూడిన నడవడికనుఅలవర్చుకోవాలని తెలిపారు. జీవితంలో ఉన్నత శిఖరాలకు చేరుకోవాలంటే గురువులు సూచించిన మార్గంలో నడవాలని, చెడు అలవాట్లకు, చెడు స్నేహాలకు దూరంగా ఉండాలని సూచించారు. పదవ తరగతి విద్యార్థులు పాఠశాల స్థాయిలో మొదటి, ద్వితీయ స్థానంలో నిలిచిన వారికి నగదు బహుమతిని ప్రకటించారు. పాఠశాల ప్రధానోపాధ్యాయులు ఇల్లంతకుంట మండల విద్యాధికారి కారు మాట్లాడుతూ ఆనందరావు ఫౌండేషన్ చైర్మన్ వెంకటేశ్వరరావు గురించి మాట్లాడుతూ అనేక సామాజిక కార్యక్రమాలు చేస్తున్న మరియు పాఠశాల అభివృద్ధిలో భాగమైన ఇలాంటి వ్యక్తులను పిల్లలు మార్గదర్శకంగా ఉపయోగించుకోవాలని జీవితంలో మీరు కూడా మంచి స్థానాల్లో ఉండాలని సూచించారు. ఆట దుస్తులు అందించిన వెంకటేశ్వరరావు కి ధన్యవాదాలు తెలియచేస్తు పాఠశాల తరపున చిరు సన్మానం చేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు ప్రవీణ్, సుల్తానా, మల్లారెడ్డి, శంకరయ్య, రమాదేవి, రాజ్కుమార్, సాంబయ్య, సదానందం విద్యార్థులు పాల్గొన్నారు.

# సీఎంఆర్ చెక్కుల పంపిణీ



**వేద న్యూస్, చొప్పదండి/రామడుగు :**

రామడుగు మండలం అనారోగ్యంతో బాధపడుతున్న బాధిత కుటుంబ సభ్యులకు ముఖ్యమంత్రి సహాయ నిధి ద్వారా మంజూరైన చెక్కులను బుధవారం కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు జవ్వాజి హరీష్ పంపిణీ చేశారు. ఈ సందర్భంగా జవ్వాజి హరీష్ మాజీ ఎంపీపీ రామడుగు మండలం కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు మాట్లాడుతూ వైద్యం పరంగా ఆపదలో ఉన్నవారికి సకాలంలో చికిత్స కోసం అందిస్తున్న నిధులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. పార్టీలకు అతీతంగా కేవలం అర్హతే ఆధారంగా సీఎం రిలీఫ్ ఫండ్ నిధులు అందిస్తున్నారన్నారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ కమిటీ చైర్మన్ బొమ్మరవేని తిరుమల తిరుపతి, కోల రమేష్, కరీంనగర్ జిల్లా ప్రధాన కార్యదర్శి పంజాల శ్రీనివాస్ గౌడ్, యూత్ కాంగ్రెస్ మండల అధ్యక్షుడు అనుపురం పర్శంగౌడ్, గ్రామ శాఖ అధ్యక్షుడు కర్ణ శీను, మైనారిటీ సెల్ ఆసిఫ్, తడగొండ హనుమంతు, డైరెక్టర్స్ స్వామి, బత్తిని అజయ్ గౌడ్, పొన్నాల సాయి కృష్ణ, రవీందర్, లక్ష్మణ్, వేణు, మనీష్, కనకయ్య, బాబు వర్ధన్, రామడుగు మండలం కాంగ్రెస్ పార్టీ సోషల్ మీడియా కోఆర్డినేటర్ జవ్వాజి అజయ్, లబ్ధిదారులు, ప్రజా ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

# కేటీఆర్ సేన బలోపేతంపై చర్చ



**వేద న్యూస్, వరంగల్:**

కేటీఆర్ సేన రాష్ట్రంలోని అన్ని జిల్లాలలో, నియోజకవర్గాలలో నూతన కమిటీలను ఏర్పాటు చేస్తున్న సందర్భంగా బుధవారం కేటీఆర్ సేన రాష్ట్ర అధ్యక్షుడు మోంగని మనోహర్.. బీఆర్ఎస్ వరంగల్ తూర్పు మాజీ ఎమ్మెల్యే నన్నపునేని నరేందర్‌ను వరంగల్ లోని వారి నివాసంలో మర్యాదపూర్వకంగా కలిశారు. కమిటీల ఏర్పాటు విషయంలో పలు అంశాలపై చర్చించారు. కేటీఆర్ సేనను గ్రామస్థాయి వరకు బలోపేతం చేయడంపై డిస్కస్ చేశారు. కార్యక్రమంలో ఆ సేన రాష్ట్ర ప్రధాన కార్యదర్శి శ్రీలం స్వామి, వరంగల్ జిల్లా అధ్యక్షుడు మైనాల నరేష్, జిల్లా ప్రధాన కార్యదర్శి మింటి రెడ్డి అశోక్, వరంగల్ ఇంచార్జ్ అజయ్, ఎం. జహంగీర్, నందగిరి భాస్కర్ గౌడ్, దిలీప్, వెంకటేష్, విజయ్, అంజయ్య తదితరులు పాల్గొన్నారు.

# ముంపు గ్రామాల సమస్యలు పరిష్కరించాలని వినతి



**వేద న్యూస్, బోయినిపల్లి :**

రాజన్న సిరిసిల్ల జిల్లా బోయినిపల్లి మండలంలోని మిడ్ మానేరు ముంపు గ్రామాల సమస్యలను వెంటనే పరిష్కరించాలని కోరుతూ స్థానిక బోయినపల్లి తహసిల్దార్ నారాయణ రెడ్డికి ముంపు గ్రామాల ఐక్యవేదిక ఆధ్వర్యంలో వినతిపత్రం ఇవ్వడం జరిగినది. ఈ కార్యక్రమంలో ముంపు గ్రామాల ఉపాధ్యక్షులు కొండం శ్రీనివాస్ రెడ్డి ,బిజెపి మండల అధ్యక్షులు ఎడపల్లి పరశురాములు ,మాజీ మండలాధ్యక్షులు గుడి రవీందర్ రెడ్డి ,సీనియర్ నాయకులు జువ్వెంతుల శ్రీనివాస్ రెడ్డి ,సారంపల్లి రాజు, స్వామి కుమార్, నలిమెల రజనీకాంత్, సుంకపాక ప్రభు, ధర్మేంద్ర, కార్తీక్ ముంపు గ్రామాల నాయకులు పాల్గొన్నారు.



# బిజెపి సంబురాలు

## – బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడిగా నరపరాజు రామచంద్ర రావు ఎన్నికైన సందర్భంగా

**వేద న్యూస్, బోయినిపల్లి :**

రాజన్న సిరిసిల్ల జిల్లా బోయినిపల్లి మండలం భారతీయ జనతా పార్టీ జాతీయ నాయకత్వం ప్రారంభించిన సంస్థాగత సంఘటన పర్వ కార్యక్రమ నేపథ్యంలో భాగంగా భారతీయ జనతా పార్టీ తెలంగాణ రాష్ట్ర శాఖ అధ్యక్షులుగా నూతనంగా నియమింపబడిన నరపరాజు రామచంద్ర రావుకి భారతీయ జనతా పార్టీ మండల శాఖ ఆధ్వర్యంలో మండల అధ్యక్షులు ఎడపల్లి పరుశరాములు, సారథ్యంలో బాణాసంచా పేల్చి స్వీట్లు పంపిణీ చేసి సంబరాలు చేసుకోని శుభాకాంక్షలు తెలియజేయడం జరిగింది. ఈ సందర్భంగా అధ్యక్షులు మాట్లాడుతూ విద్యార్థి నాయకుడిగా, సీనియర్ న్యాయవాది గా, శాసన మండలి సభ్యునిగా, ప్రస్థానం సాగించి, పేద ప్రజల కోసం అహర్నిషలు శ్రమించే పోరాట యోధుడు నరపరాజు రామచంద్ర రావును భారతీయ జనతా పార్టీ తెలంగాణ రాష్ట్ర శాఖ నూతన అధ్యక్షుడిగా నియమించడం హర్షనీయమని తెలియజేయడం జరిగినది. ఈ కార్యక్రమంలో జిల్లా కౌన్సిల్ సభ్యులు ఉదాహరి నరసింహాచారి, మాజీ మండల అధ్యక్షులు గుడి రవీందర్ రెడ్డి , మండల సీనియర్ నాయకులు బొంగోని అశోక్ గౌడ్, కొండం శ్రీనివాస్ రెడ్డి, జువ్వెంతుల శ్రీనివాస్ రెడ్డి ,కొనుకటి హరీశ్,శరత్, గంగాధర్ చారి, సారంపల్లి రాజు, సుంకపాక ప్రభు, చిలుముల రమేష్, కందారపు వెంకటేష్, కళ్యాణం అనిల్, సింగరి వెంకటేష్, సాయికుమార్, రజనీకాంత్, పసికంటి వెంకటేష్ , రేగుల రమేష్, నవీన్ , సావన్ పెల్లి అనిల్, పబ్బాల వినోద్ ,రాచర్ల రాజేశం, ధర్మేంద్ర, కార్తిక్,ఆనంద్, నాయకులు , కార్యకర్తలు, తదితరులు పాల్గొన్నారు.

# రైతును రాజు చేయడమే ప్రభుత్వ లక్ష్యం

పాలాభిషేకం నిర్వహించారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే సత్యం మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన కొన్ని నెలల్లోనే రాష్ట్రంలో ఉన్న 25 లక్షల రైతులకు 20వేల కోట్ల రుణమాఫీ చేసిన ఘనత కాంగ్రెస్ పార్టీకి దక్కిందని కొనియాడారు కేవలం 9 రోజుల వ్యవధిలోనే 9000 కోట్ల రైతు భరోసానిచ్చి రైతంగానికి కాంగ్రెస్ ప్రభుత్వం అండగా నిలిచిందని అభివర్ణించారు, కేవలం సంవత్సరంనర కాలంలోనే ఈ దేశంలో ఏ రాష్ట్రం చేయని విధంగా లక్ష కోట్లు ఖర్చుపెట్టిన ప్రభుత్వం కాంగ్రెస్ ప్రభుత్వమని అన్నారు. అదేవిధంగా 2004లో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిన తర్వాత ఆనాడు 72,000 కోట్లను దేశవ్యాప్తంగా రుణమాఫీ చేసామని అన్నారు.రైతు బీమా,రైతు భరోస ఇస్తున్నటువంటి సీఎం రేవంత్ రెడ్డి, ప్రభుత్వానికి ప్రత్యేకంగా కృతజ్ఞతలు తెలుపుతున్నామని అన్నారు. ఈ కార్యక్రమంలో ఏఎంసీ చైర్మన్ బోయిని ఎల్లేష్ యాదవ్, బీసీ సెల్ జిల్లా అధ్యక్షులు కూస రవీందర్, ఉమ్మడి జిల్లా మాజీ డిసిఎంఎస్ చైర్మన్ ముదుగంటి సురేందర్ రెడ్డి, మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు వన్నెల రమణారెడ్డి,సెస్ డైరెక్టర్ కొట్టపల్లి సుధాకర్,బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షులు భీమ్ రెడ్డి మహేశ్వర్ రెడ్డి సింగిల్ విండో చైర్మన్లు జోగినపల్లి వెంకట రామారావు వెసిరెడ్డి దుర్గారెడ్డి, ఏఎంసి వైస్ చైర్మన్ వినోద్ రెడ్డి , తదితరులు పాల్గొన్నారు.

# ఎమ్మెల్యే చేతుల మీదుగా కంది విత్తనాల పంపిణీ




**వేద న్యూస్, బోయినిపల్లి :**

రాజన్న సిరిసిల్ల జిల్లా బోయినపల్లి మండల కేంద్రంలో బుధవారం జాతీయ ఆహార భద్రత పథకం కింద బోయినిపల్లి మండలంలో పప్పు ధాన్యాల విస్తీర్ణం పెంచేందుకు గాను కంది విత్తనాలు చిన్న సంచుల రూపంలో 4 కేజీ ల బ్యాగులు 23 బ్యాగ్ లను కేటాయించడం జరిగింది. ఈ విత్తనాలను చొప్పదండి శాసన సభ్యులు మేడిపల్లి సత్యం, చేతుల మీదుగా రైతులకు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ఏఎంసీ చైర్మన్ బోయిని ఎల్లేష్, సెస్ డైరెక్టర్ కొట్టేపల్లి సుధాకర్, మండల ప్రాథమిక సహకార సంఘం అధ్యక్షులు జోగినిపల్లి వెంకట రామ రావు, ముదిగంటి సురేందర్ రెడ్డి, వేసిరెడ్డి దుర్గా రెడ్డి, కూస రవీందర్, వన్నెల రమణ రెడ్డి, బి మహేశ్వర్ రెడ్డి తదితరులు, వ్యవసాయ శాఖ నుండి మండల వ్యవసాయ అధికారి కె ప్రణీత , ఏఈఓ లు రవళి, రజిత, లక్ష్మణ్ పాల్గొన్నారు.

# డబ్బాలు కిరాయికి ఇస్తే కఠిన చర్యలు




తూ.. చిరు వ్యాపారులు తమ వస్తువులను బ్రిడ్జి దాటి రోడ్డు వరకు పెట్టడం వల్ల వాహన దారులు తమ వాహనాలను రోడ్డుపై నిలిపి, వాహనాల రాకపోకలకు తీవ్ర అంతరాయం కలిగిస్తున్నారని, దీనివల్ల ప్రమాదాలు జరిగే అవకాశం ఉందని పేర్కొన్నారు. చిన్న వ్యాపారులు తమ హద్దులు మీరి ముందుకు రాకూడదని హెచ్చరించారు. బ్రిడ్జి కింద స్థలాన్ని ఆక్రమించి దుకాణాలను ఏర్పాటు చేసి అద్దెలకు ఇచ్చి సొమ్ము చేసుకుంటే కఠిన చర్యలు తీసుకుంటామని వెల్లడించారు.

# సంపాదకీయం

## పంట పొలాల నుండి జనం శరీరాల్లోకి కృత్రిమ రసాయనాలు

భూమిలో సహజంగా ఉండే పోషకాలతో పాటు సేంద్రీయ ఎరువుల ద్వారా గతంలో భూసారం తగ్గకుండా సూక్ష్మ స్థూల పోషకాలు ఘననియంగా అందేవి. హరిత విప్లవం కారణంగా 1965 -70 ప్రాంతం నుండి కృత్రిమ ఎరువుల పైన ఆధారపడిన కారణంగా దిగుబడి ఎక్కువగా కావాలనే నెపంతో ఎరువులు పురుగు మందుల వాడకం పెరిగి అదుపు చేయలేని దుస్థితికి చేరుకోవడం వల్ల నేడు పంట పొలాల్లో విచ్చల విడిగా చల్లుతున్నటువంటి రసాయనిక పదార్థాలు జనం శరీరాల్లోకి చేరి గుల్లబారుస్తున్న విషయాన్ని మనం ఆలస్యంగానైనా గమనించి తగిన జాగ్రత్తలు తీసుకోవాలి. ఎరువులు పురుగు మందుల వాడకాన్ని విచ్చలవిడిగా వాడుతున్న దేశాలలో భారతదేశం కూడా ఒకటి కావడం ఆందోళనకరమైతే 2023- 24 సంవత్సరంలో భారత దేశవ్యాప్తంగా 64.84 మిలియన్ మెట్రిక్ టన్నుల రసాయన ఎరువులను పంట పొలాలలో కుమ్మరించినట్లు తెలుస్తుంది. జాతీయ సగటుకు రెట్టింపు స్థాయిలో ఆంధ్రప్రదేశ్ తెలంగాణ ఇతర రాష్ట్రాలలో ఎరువు లను కుమ్మరించడం మించిపోయిన కారణంగా ఆరోగ్య రక్షణ,ఆహార భద్రత, ప్రజాసంక్షేమం, సంక్షోభంలో పడే ప్రమాదం లేకపోలేదు. అధిక ఫలాన్ని ఆశించి పొలాలలో ఎరువులను విపరీతంగా చల్లడంతో పంట చేలకు చీడపీడల బెడద ఎక్కువై క్రిమిసంహారక మందులు చల్లవలసి రావడంతో పెట్టుబడి తడిసి మోపెడుతున్నది. .రసాయన అవశేషాలు ఆహారం ద్వారా శరీరంలోకి పోయి క్యాన్సర్లు ఇతర భయంకరమైన అనారోగ్య సమస్యలకు ప్రజలు బలి అవుతుంటే ఆయా కుటుంబాల ఖర్చు కూడా గణనీయంగా పెరిగిపోయింది. నత్రజని ఫాస్పరస్ పొటాషియం ఎన్పీకే నిష్పత్తి 4:2:1కి నించకూడదని నిబంధన ఉంటే గత సంవత్సరం 10:3:7 గా నమోదు అయినట్లు తెలుస్తున్నది. ఒక దశలో భారత దేశంలో పంజాబ్ తర్వాత ఆంధ్రప్రదేశ్ తెలంగాణలో రసాయ న ఎరువుల వాడకం ఎక్కువగా ఉందని దాన్ని తగ్గించాలని కేంద్రం సూచన చేసినప్పటికీ పరిస్థితుల్లో మార్పు రాకపోవడం, భూసార పరీక్షలను పట్టించుకోకుండా ఇష్టం ఉన్నట్టుగా వ్యవహరించడం వల్ల నేలలు సారాన్ని కోల్పోయి దిగుబడి తగ్గి అన్ని రకాల నష్టానికి కారణం అవుతున్న రసాయన ఎరువులు పురుగు మందుల వాడకాన్ని నిర్బంధంగా తగ్గించి తీరాల్సిన అవసరం ఉంది.

సుమారు 50 సంవత్సరాలపైగా దేశంలో ఎరువుల వాడకంలో వచ్చిన మార్పుల కారణంగా పండించిన పంటలు వరి గోధుమల్లో ఐరన్ జింక్ వంటి పోషక విలువలు తగ్గి నామ మాత్రంగా మిగిలిపోయినాయి. వరిలో ప్రమాదకరమైన ఆర్సినిక్ పెద్ద మొత్తం లో పేరుకుపోవడం అనారోగ్యకరం. వీటికి తోడు జీవనశైలి తగినట్లు లేకపోవడం వల్ల అనేక రోగాల బారిన ప్రజలు పడక తప్పడం లేదు. భూములు నిస్సారమై పోషకాహారం అందక జన భారతం గగ్గోలు పెడుతున్నది. ఈ దుర్భర పరిస్థితుల నుండి భారతదేశాన్ని గట్టెక్కించాలంటే సేంద్రీయ పద్ధతిలో వ్యవసాయం కీలకమని నిపుణులు అభిప్రాయపడుతున్నారు. ఆ వైపుగా కేంద్రం సేంద్రియ వ్యవసాయంపై దృష్టి సారించి రాబోయే రెండు సంవత్సరాల లో 2,481 కోట్ల ఖర్చు చేయాలని నిర్ణయం తీసుకోవడం అభినందనీయం. రైతులను అందుకు సమాయత్తం చేయడం, జనంలో చైతన్యం తీసుకురావడం, విచ్చలవిడి ఎరువుల వాడకాన్ని చాలా అదుపు చేయడం అవసరమైతే ఎరువుల వాడకం పైన వ్యతిరేక ప్రచారం చేయడం వల్ల సమాజం కూడా తన వంతు బాధ్యత పోషించాల్సిన అవసరం ఉంది. 7.5 లక్షల హెక్టార్లలో సేంద్రీయ పద్ధతిలో వ్యవసాయాన్ని చేపట్టి కోటి మంది రైతులకు కొత్త ఒరవడి చూపించాలన్నది కేంద్ర ప్రభుత్వ నిర్ణయం. ఈ నిర్ణయం అమలు కావాలంటే, ఆరోగ్యకరమైనటువంటి పోషకాహారం ప్రజలకు అందించాలంటే, అనేక రోగాల బారి నుండి ప్రజలను కాపాడాలంటే, నూతన పరిస్థితులకు అనుగుణంగా వ్యవసాయ విధానాలను మార్చవలసిన అవసరం చాలా ఉన్నది. కేవలం కేంద్ర ప్రభుత్వం నిర్ణయం తీసుకుంటే సరిపోదు రాష్ట్ర ప్రభుత్వాల తోడ్పాటు రైతుల సమాయత్తం చేసే కృషి కీలకం.అదే దశలో ఎరువులు పురుగుమందుల యొక్క తయారీ ఉత్పత్తుల కంపెనీలను సగానికి సగం తగ్గించడం తో పాటు భూసార పరీక్షలను ప్రతి ఏటా నిర్వహించడం ద్వారా ప్రభుత్వాలే రైతులకు భరోసాను కల్పించాల్సిన అవసరం ఉన్నది. భూసార పరీక్షల ఫలితాలను బట్టి అవసరమైనటువంటి పోషకాలను ఆ భూమికి అందించడానికి కృషి జరగాలి ఆ వైపుగా పరిశోధనలు మరింత ముమ్మరం చేయాలి. భూములు నిస్సారమై పోషకాహారం అందక జన భారతం గగ్గోలు పెడుతున్నది. ఈ దుర్భర పరిస్థితుల నుండి భారతదేశాన్ని గట్టెక్కించాలంటే సేంద్రీయ పద్ధతిలో వ్యవసాయం కీలకమని నిపుణులు అభిప్రాయపడుతున్నారు. ఆ వైపుగా కేంద్రం సేంద్రియ వ్యవసాయంపై దృష్టి సారించి రాబోయే రెండు సంవత్సరాల లో 2,481 కోట్ల ఖర్చు చేయాలని నిర్ణయం తీసుకోవడం అభినందనీయం. రైతులను అందుకు సమాయత్తం చేయడం, జనంలో చైతన్యం తీసుకురావడం, విచ్చలవిడి ఎరువుల వాడకాన్ని చాలా అదుపు చేయడం విచ్చలవిడిగా తయారవుతు న్నటువంటి చెత్త నుండి ఎరువులను తయారు చేయడం వళ్ళ చెత్తకు ఒకరకంగా పరిష్కారాన్ని చూపడంతో పాటు సేంద్రీయ ఎరువును అవసరమైన మేరకు ఉత్పత్తి చేసుకోవడానికి అవకాశం ఉంటుంది. తక్కువ ఖర్చుతో సేంద్రియ ఎరువు సమీకరణ వలన రైతు పైన కూడా ఆర్థిక భారం తగ్గే అవకాశం ఉంటుంది. ఇదంతా జరగాలంటే రైతులలో ఆత్మవిశ్వాసాన్ని పెంచాలి, నమ్మకాన్ని కలిగించాలి, పంటల దిగుబడి కి ఎలాంటి నష్టం లేదని భరోసాను ప్రభుత్వాలు శాస్త్రవేత్తలు ఇవ్వగలగాలి,అవసరమైతే నష్టం జరిగిన సందర్భంలో తొలిదశలో నష్టపరిహారాన్ని కూడా ప్రభుత్వం బాధ్యతగా తీసుకోవాలి, క్రమంగా సేంద్రీయ ఎరుల వాడకం వైపు ఈ దేశంలో వ్యవసాయం మార్పు చెందితే అనారోగ్య సమస్యలు క్రమంగా వాటంతట అవే తగ్గుతాయి.

# అంగరంగ వైభవంగా బీరన్న బోనాలు నిర్వహిస్తాం

**వేద న్యూస్, కరీమాబాద్ :**




- కోరే కృష్ణ కురుమ

జులై 6న తొలి ఏకాదశి పర్వదినాన్ని పురస్కరించుకొని కరీమాబాద్ కురుమ కులస్తులు బీరన్న బోనాలను ఘనంగా నిర్వహించనున్నట్లు ఆలయ కమిటీ అధ్యక్షులు కోరే కృష్ణ కురుమ తెలిపారు. బుధవారం బీరన్న కుంటలోని ఆలయంలో పత్రిక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కోరె కృష్ణ మాట్లాడుతూ ఈనెల 6న ఉదయం 10 గంటల 30 నిమిషాలకు పట్టు వస్త్రాలు మరియు జాతీయ జెండాను చేత భూనీ పురవీధుల గుండా తిరుగుతూ ఆలయానికి చేరుకొని ఆలయంలోని చెట్టుపై జాతీయ జెండాను కడతామన్నారు. అనంతరం మధ్య 2 గంటల సమయంలో నెత్తిన బోనాలతో దారి పొడవున బీరన్నల విన్యాసాలతో బోనాలు సాగుతాయన్నారు. బోనాలన్నీ కరీమాబాదులోని బురుజు సెంటర్లోకి రాగానే గావుపట్టే కార్యక్రమం ఉంటుందన్నారు. గావును తిలకించేందుకు వందలాదిమంది ప్రజలు అక్కడకు వస్తారన్నారు. అనంతరం గావు పట్టిన గొర్రెపిల్లను దాటుతూ మహిళలు ఆలయానికి చేరుకుంటారన్నారు. ఆలయంలో బీరన్న కామరతుల కళ్యాణం నిర్వహించి స్వామివారికి నైవేద్యం సమర్పించి ఇంటికి వెళ్తామన్నారు. ప్రతి ఏటా అందరి సహకారంతో బోనాలను విజయవంతంగా నిర్వహిస్తున్నామన్నారు. ఈ ఏడాది సైతం అందరూ సహకరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్లు పల్లం పద్మ, మరుపల్ల రవి, ఉపాధ్యక్షులు కడారి కృష్ణ, ప్రధాన కార్యదర్శి మురికి రాజు, సహాయ కార్యదర్శి దయ్యాల సుధాకర్, కోశాధికారి నరిగే లక్ష్మణ్, కుల పెద్దలు దయ్యాల పురుషోత్తం, మండల రాజు, ముఖ్య సలహాదారులు కంకల మల్లేశం, మండల కొమురెల్లి కోర కుమారస్వామి, బండారి రాజేశ్వర్, ఆర్గనైజర్స్ నంద నవీన్, గొట్టే సదానందం, గొట్టే మల్లేశం, కార్యవర్గ సభ్యులు కంచ తిరుపతి, వాసవి శ్రీనివాస్, ఎమ్మే వేణు, కోరే రమేష్, అన్న శ్రీనివాస్, మురికి చిన్న రవి, కంచ మెట్టయ్య, కొమ్ము రాజు, కాటన్ సతీష్, బండారి మల్లేశం, కురుమ కులస్తులు పాల్గొన్నారు.

# తక్కువ పరిహారానికి భూములు ఎందుకు ఇవ్వాలి..?

**- నోటీసులు లేకుండా పనులు ఎలా చేస్తారు..? - నిరసన తెలిపిన రైతులను బలవంతంగా ఈడ్చుకెళ్ళిన పోలీసులు..!**

**వేద న్యూస్, మానకొండూర్ :**



కరీంనగర్ నుండి వరంగల్ వరకు జరుగుతున్న నాలుగు వరుసల జాతీయ రహదారి(563) విస్తరణలో భూముల సేకరణలో భాగంగా అనే రైతుల వ్యవసాయ భూముల నుండి సేకరించడం జరిగింది.అయితే దీనికిగాను ప్రభుత్వం రోడ్డు కింద భూమి కోల్పోయిన బాధిత రైతులకు తక్కువ పరిహారం ఇచ్చి బలవంతంగా భూములు లాక్కుంటున్నారని, అడ్డు వచ్చిన రైతులపై దౌర్జన్యానికి దిగుతున్నారని స్థానిక రైతులు తెలుపుతున్నారు. తాజాగా మానకొండూరు మండలంలోని చెంజర్ల గ్రామానికి చెందిన కాని గంటి కుమార్ అనే రైతు తన భూమిలో రోడ్డు నిర్మాణ పనులను అడ్డుకోగా,పోలీసులు బాధిత రైతును అరెస్టు చేసి పనులు కొనసాగేట్లు చేసినారని, ఆవేదన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా బాధిత రైతు మాట్లాడుతూ, భూమిని కోల్పోయిన మాకు అతి తక్కువ నష్టపరిహారం ఇస్తూ, ఇలా మా భూములను లాక్కోవడం, అడ్డువచ్చిన మాపై పోలీసులతో దౌర్జన్యం చేయించడం దుర్మార్గమని వారు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తూ, మండలంలోని అనేక గ్రామాలలో రైతులు సైతం తమ భూములు ఇచ్చినందుకు నిరాకరిస్తున్నారని ఆరోపించారు. ఇంత తక్కువ పరిహారానికి భూములు ఎలా ఇస్తారని? అసలు నోటీసులు ఇవ్వకుండా పనులు ఎలా చేస్తారని? ఈ సందర్భంగా అధికారులను బాధిత రైతులు ప్రశ్నిస్తున్నారు. అంతేకాకుండా మార్కెట్లో ఒక గుంటకు రూ.10లక్షలు ఉండగా అధికారులు తమకు కేవలం 63 వేల రూపాయలు మాత్రమే ఇచ్చి చేతులు దులుపుకుంటున్నారని, బాధిత రైతు ఆరోపించినాడు. అంతేకాకుండా తనని చంపి తన భూమిలో నుండి రోడ్డు వేయండి అని అడ్డుగా వెళ్లి నిరసన తెలిపిన రైతులను పోలీసులు ఈడ్చుకెళ్లి తమ వాహనాలలో తరలించినారని తెలిపినారు. దీని పట్ల స్థానిక రైతులు,అదేవిధంగా బాధిత రైతులు తీవ్ర ఆవేదన వ్యక్తం చేస్తూ, ఇప్పటికైనా సంబంధిత శాఖ అధికారులు, ప్రభుత్వం స్పందించి మాకు తగిన నష్టపరిహారం చెల్లించాలని, మాపై దూసురుగా ప్రవర్తించిన అధికారులు, పోలీసులపై చర్యలు తీసుకోవాలని సందర్భంగా వారు డిమాండ్ చేశారు.

# అదుపులోకి తీసుకొన్నారు..వదిలేశారు...!?

**- అక్రమ ఇసుక రవాణాను అడ్డుకుని ఎస్సై..!**

**- ట్రాక్టర్లను సీజ్ చేయడంతో బయటపడ్డ బాగోతం**

**- అదుపులోకి తీసుకున్న నేతను విడుదల చేయాలని ఒత్తిడి..!**

**- అధికార పార్టీ నేత ఫోన్ కాల్ తో వదిలేసిన పోలీసులు?**

**వేద న్యూస్, రాజన్న సిరిసిల్ల :**

రాజన్న సిరిసిల్ల జిల్లా సిరిసిల్ల నియోజకవర్గంలో మళ్లీ ఇసుక మాఫీయాకు కాంగ్రెస్ నేతలు దారులు వేస్తున్నారని ఆరోపణలు బలంగా వినిపిస్తున్నాయి. రాజన్న సిరిసిల్ల జిల్లాలో ఇసుక కొరతతో ఆకాశన్నంటిన ఇసుక ధరలను అదునుగా చూసుకోని ఓ అధికార పార్టీ నేత ఇసుక స్మగర్లతో చేతులు కలిపి.. పోలీసుల పేరు చెప్పి అక్రమంగా డబ్బులు వసూలు చేసినట్లు విశ్వసనీయ సమాచారం. వివరాల్లోకి వెళితే.. సిరిసిల్ల నియోజకవర్గంలోని సిరిసిల్ల పోలీస్ సబ్ డివిజన్ పరిధిలోని ఒక మండలంలో ఎస్సై పేరు చెప్పి ఓ నేత ఇసుక ట్రాక్టర్ ఓనర్ల వద్ద వేలాది రూపాయాలు వసూలు చేసినట్లు తెలిసింది. ఇసుక అక్రమ రవాణా విషయం తెలిసిన ఎస్సై దాడులు చేసి ట్రాక్టర్లను సీజ్ చేయడంతో సర్ మేం డబ్బులిచ్చి ఇసుక రవాణా చేస్తున్నం.. మీ పేరు చెబితేనే డబ్బులిచ్చాం అని ట్రాక్టర్ ఓనర్లు, ఇసుక రవాణదారులు ఎస్సై కి పేర్కొనడంతో.. కోపంతో సదరు నేతను అదుపులోకి తీసుకొని నాలుగు గంటల పాటు పోలీస్ స్టేషన్లు విచారించినట్లు తెలిసింది. దీంతో కాంగ్రెస్ ముఖ్య నేతలకు విషయం తెలిసి.. ఎస్సైకి ఫోన్ చేసి వదిలేయాలని ఒత్తిడి తేవడంతో వదిలేసినట్లు సమాచారం.


**- ఇసుక ను బ్లాక్ చేసి సొమ్ము చేసుకుంటున్న నేతలు..?**

రాజన్న సిరిసిల్ల జిల్లాలో ఇసుకను బ్లాక్ చేసి కొంత మంది కాంగ్రెస్ నేతలు వసూళ్ల పర్వం మీద పడ్డట్ల ఆరోపణలు వస్తున్నాయి. సిరిసిల్ల నియోజకవర్గంలో 15 రోజులకు ఒకసారి ఇసుక వేబిల్లులు ఇవ్వడంతో ఇందిరమ్మ ఇండ్లతో పాటు ప్రైవేట్ నిర్మాణాలు కూడా నిలిచిపోతు న్నాయి. బ్లాక్ లో ఇసుక ట్రిపు ధర రూ.5000 వరకు పలుకుతుంది. దీనిని అదునుగా తీసుకోని కొంత మంది నేతలు వసూళ్ల పర్వం మీద పడుతున్నారు. ఇటు కాంగ్రెస్ పార్టీకి, ప్రభుత్వానికి చెడ్డ పేరు తెస్తున్నారు. ఇటువంటి అవినీతి నేతలకు ముఖ్య నేతలు సపోర్ట్ చేయడం తీవ్ర విమర్శలకు దారి తీస్తుంది. ఉదయం లేస్తే గత ప్రభుత్వం ఇసుక మాఫీయా చేసింది అని ప్రెస్ మీట్లు పెట్టే నాయకులు అక్రమ వసూళ్లకు పాల్పడ్డ తమ అనుచరులకు సపోర్ట్ చేసి విడిపించారని చర్చ కొనసాగుతుంది. పోలీసులు కూడా కాంగ్రెస్ నేత ఒత్తిళ్లకు తలొగ్గి వదిలేశారని ఆరోపణలు వస్తున్నాయి.

ఈ సంఘటనపై సదరు మండల ఎస్సైని వివరణ కోరగా.. ఈ అక్రమ వసూళ్లు విషయం తన దృష్టికి వచ్చిందని.. రామస్వామి అనే వ్యక్తి ఇచ్చినట్లు ప్రాథమిక సమాచారం రాగా ఆరోపణలు వచ్చిన వ్యక్తిని పిలిచి విచారణ చేశానన్నారు. ఫోన్ ఫే లో రూ.10 వేలు కొట్టినట్లు ఉన్నాయని, ఈ డబ్బులు ఇసుక రవాణ కోసం కాదు అని మళ్లీ చెప్పడంతో వదిలేశామన్నారు. ఆ డబ్బులు కూడా వాపస్ కొట్టారని పేర్కొనడం విశేషం. ఈ విషయం జిల్లా పోలీసు ఉన్నతాధికారులకు తెలియడంతో విచారణ చేస్తున్నట్లు విశ్వసనీయ సమాచారం.

# పోగొట్టుకున్న సెల్ ఫోన్ అప్పగింత

**వేద న్యూస్, ఎల్లారెడ్డిపేట :**



ఎల్లారెడ్డిపేట మండలంలోని బాకూర్పల్లి తండా కు చెందిన ఓ వ్యక్తి ఫోన్ పోయిందని పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు చేశారు. ఎస్ఐ రాహుల్ రెడ్డి సి ఈఐఆర్ యాప్ ద్వారా ఐ యమ్ ఈ నెంబర్ తో సెల్ ఫోను ఆచూకీ కనుగొని బాకూర్పల్లి తండా కు చెందిన బాధితుడు రామావత్ మోహన్ కు అ ఫోన్ ను పోలీస్ స్టేషన్లో అప్పగించారు. ఈ సందర్భంగా ఎస్ఐ రాహుల్ రెడ్డి మాట్లాడుతూ ఎవరైనా తమ సెల్ ఫోన్లు పోయినా, దొంగలించబడినా నేరుగా పోలీస్ స్టేషన్ లో ఫిర్యాదు చేస్తే సిఈఐఆర్ అనే టెక్నాలజీ ద్వారా వీలైనంత తొందరగా సెల్ఫోన్ గుర్తించి పట్టుకోవచ్చని తెలిపారు. సెల్ఫోన్ పోయిన బాధితుడు తన సెల్ ఫోన్ ను కనుగొని అప్పగించి నందుకు పోలీస్ సిబ్బందికి ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు.

# న్యాయం చేయరూ...!



మొదటి పేజీ తరువాయి

చదువుకున్న పిల్లలు ఎవరైనా ఉంటే అవకాశం ఉన్నప్పుడు పాఠశాలలో ఏదైనా ఉద్యోగం ఇప్పిస్తామని మాట ఇచ్చారని, కమలాపూర్ గ్రామ బిడ్డ అయిన మంత్రి తమకు అన్యాయం చేయడని భావించి, కేవలం నోటిమాట ద్వారానే భూమి ఇవ్వడానికి ఒప్పుకుని నిరభ్యంతరంగా భూమిని ఇచ్చామని బాధితులు వెల్లడించారు.

**- అధికారుల చుట్టూ తిరిగి అలసిపోయాం**

అప్పటినుంచి ఇప్పటివరకు తమకు ఎక్కడా భూమి కేటాయించలేదని, ఈ విషయమై అప్పటి మినిస్టర్ ఈటల రాజేందర్ దగ్గరికి పలుమార్లు వెళ్లామని, ఆయన తన అనుచరులకు చెప్పి ఆ పని పూర్తి చేయాలని చెప్పినా.. అధికారుల దగ్గరికి వెళ్లాలని వారు సూచించారని పేర్కొన్నారు. దాంతో అధికారుల చుట్టూ ఎన్నిసార్లు తిరిగినా తమను పట్టించుకోలేదని తోటరాజు ఆవేదన వ్యక్తం చేశాడు. 2016 నుంచి ఇప్పటివరకు కలెక్టర్లు, ఎమ్మార్వోలు అందరూ మారారని కానీ, తనకు మాత్రం న్యాయం జరగలేదని, అధికారుల చుట్టూ చెప్పులు అరిగేలా తిరిగినా కూడా తనకు భూమి కేటాయించట్లేదని ఇక ఓపిక పట్టలేమని స్పష్టం చేశారు. తమకు 2016లో హామీ ఇచ్చిన విధంగా గుంటకు రెండు గుంటల భూమితో పాటు ఇల్లు కట్టించి ఇవ్వాలని, అలా ఇచ్చేవరకు తామంతా పాఠశాలలోనే ఉంటామని భూమి కోల్పోయిన బాధితులు తమ గోడును వెలిబుచ్చారు.

వేద న్యూస్

గురువారం, జులై 03, 2025

## మురళిని పిచ్చాసుపత్రిలో చేర్పించాలి

మరిచారా? అని ప్రశ్నిం చారు. వారి లాగా ఎర్రబెల్లి కుటుంబ సభ్యులు ఎవరూ వ్యక్తిగత విమర్శలు చేయబోరని, బూతులు తిడుతూ కించపరిచే వ్యాఖ్యలు చేయడం తమ సంస్కృతి కాదన్నారు. మురళికి పిచ్చి పట్టిందని, ఆయనను వెంటనే ఎర్రగడ్డ పిచ్చాసుపత్రిలో చేర్పించాలని విమర్శించారు. రెడ్డి సామాజిక వర్గం సహకారంతో రాజకీయంగా ఎదిగి.. నేడు అదే రెడ్డి సామాజిక వర్గాన్ని బండబూతులు తిడుతున్నాడని మండిపడ్డారు. నాడు రాజశేఖర్‌రెడ్డి వద్ద నుంచి మంత్రి పదవి తెచ్చుకున్న విషయం మరిచారా? అని అడిగారు. కేసీఆర్ కాళ్లు పట్టుకొని ఆనాడు ఎమ్మెల్యే, ఎమ్మెల్సీ పదవులు తెచ్చుకున్నది నిజం కాదా? అని అడిగారు. రేవంత్‌రెడ్డి భిక్షతో మంత్రి పదవి తెచ్చుకున్నది నిజం కాదా? అనేది కొండా మురళి సమాధానం చెప్పాలని ప్రదీప్‌రావు సవాల్ విసిరారు. తాను బీసీల పక్షపాతి అంటూ మురళి చేస్తున్న కామెంట్స్‌ను ఖండించారు. బీసీ సామాజిక వర్గానికి చెందిన ఒక కార్పొరేటర్‌ను అక్రమంగా జైల్లో పెట్టించారని? ఇటీవల మరో బీసీ కార్పొరేటర్ పై మహిళతో తప్పుడు కేసులు నమోదు చేయించి.. ఇబ్బందులకు గురి చేశారని వెల్లడించారు. బీసీలను హింసిస్తూ బీసీల కోసమే తాను పనిచేస్తున్నాను మురళి చెప్పడాన్ని జనం నమ్మడం లేదన్నారు. అటు సొంత పార్టీ నేతలను ఇటు వరంగల్ తూర్పు సామాన్య ప్రజలను ఇబ్బందులు పెడుతున్న కొండా మురళి తీరును తప్పుపట్టారు. వరంగల్ తూర్పు లో గెలిచి మంత్రి పదవి దక్కించుకున్న కొండా దంపతులు తూర్పులో తట్టెడు మట్టి కూడా ఎత్తలేదని ధ్వజమెత్తారు. ఎలాంటి అభివృద్ధి పనులు చేయక కేవలం విమర్శలు చేస్తూనే.. కాలం గడుపుతున్నారని ఆరోపించారు. వరంగల్ తూర్పు అభివృద్ధిపై బహిరంగ చర్చకు సిద్ధమని చాలెంజ్ చేశారు. వరంగల్ ఓసిటిలోని ప్రభుత్వ క్యాంపు కార్యాలయానికి కొండా మురళి తరచూ వస్తూ.. అధికారిక కార్యక్రమాల్లో ఎలా పాల్గొంటారని ప్రశ్నించారు. అధికార దుర్వినియోగం జరుగుతున్నా జిల్లా అధికారులు ఏం చేస్తున్నారని మండిపడ్డారు. ఎలాంటి ప్రొటోకాల్ లేని వ్యక్తికి యంత్రాంగం సహకరించడాన్ని తప్పుపట్టారు. కొండా మురళిని రాజకీయంగా ఎదుర్కోవడానికి తాము సిద్ధమని ప్రదీప్‌రావు తేల్చిచెప్పారు.

**- సురేఖ సభ్యత్వాన్ని రద్దు చేయాలని వినతి**

గత ఎన్నికల్లో రూ.70 కోట్లు ఖర్చు చేశానని, ప్రజాస్వామ్యాన్ని అపహాస్యం చేసేలా కొద్ది రోజుల క్రితం మంత్రి కొండా సురేఖ భర్త కొండా మురళి చేసిన సంగతి తెలిసిందే. ఈ నేపథ్యంలో సురేఖ ఎమ్మెల్యేగా కొనసాగడం అనైతికమని పేర్కొంటూ.. ఆమె శాసనసభ సభ్యత్వాన్ని రద్దు చేయాలని రాష్ట్ర ఎన్నికల అధికారులను బీజేపీ రాష్ట్ర నాయకుడు ఎర్రబెల్లి ప్రదీప్‌రావు కోరారు. ఈ మేరకు ఆయన బుధవారం ఆఫీసర్లకు వినతి పత్రం సమర్పించారు.

## 'వన్ మంత్' రిక్వెస్టు



వేల కోట్లతో కొత్త ఆసుపత్రి నిర్మిస్తున్నామన్నారు. నిమ్స్‌లో మరో 2 వేల పడకల విభాగం ప్రారంభించబోతున్నాం. అలాగే వరంగల్, అల్వాల్, ఎల్‌బీ నగర్, సనత్‌నగర్ తదితర ప్రాంతాల్లో కార్పొరేట్‌కు దీటుగా రాష్ట్రంలో 7 వేల పడకలతో ఆసుపత్రులను వచ్చే డిసెంబర్ 9 నాటికి అందుబాటులోకి తేవాలని నిర్దేశించామని వెల్లడించారు. పెరిగిన వైద్య ఖర్చులను దృష్టిలో పెట్టుకుని అధికారం చేపట్టగానే రాజీవ్ ఆరోగ్యశ్రీ పరిమితిని రూ.2 లక్షల నుంచి 10 లక్షలకు పెంచాం. దాంతో పాటు ముఖ్యమంత్రి సహాయ నిధి కింద ఇప్పటివరకు రూ.14 వందల కోట్లు ఖర్చు చేశాం. నిరుపేదలకు వీలైనంత వరకు విద్య, వైద్యం అందించాలన్న ఆలోచనతో ఆ రంగాలకు అధిక ప్రాధాన్యత ఇస్తున్నాం. బడ్జెట్‌లో వైద్య రంగానికి రూ.11,500 కోట్లు, విద్యకు రూ.21 వేల కోట్లు కేటాయించామని అన్నారు. రాష్ట్రంలో స్వయం సహాయక సంఘాల్లో కోటి మంది సభ్యులను చేర్పించడమే కాకుండా వారందరి హెల్త్ ప్రొఫైల్ తయారు చేయాలన్నది మా లక్ష్యం. వారందరికీ వారివారి హెల్త్ ప్రొఫైల్స్‌తో ఒక యూనిక్ ఐడీ నంబర్‌తో కార్డులను జారీ చేయాలి. మహిళలు ఎక్కువగా క్యాన్సర్ బారిన పడుతున్నారు. అందుకే నివారణ చర్యల్లో భాగంగా హెల్త్ ప్రొఫైల్స్ తయారు చేయాలన్న ఆలోచన చేశామని స్పష్టం చేశారు. రాబోయే వంద సంవత్సరాలు లక్ష్యంగా తెలంగాణ రైజింగ్ 2047 విజన్ డాక్యుమెంట్‌లో ఒక చాప్టర్ ఆరోగ్య రంగం. అందుకోసం డాక్టర్ నాగేశ్వర రెడ్డి భాగస్వామ్యం కావాలి. క్యాన్సర్ చికిత్సకు సంబంధించి ఇటీవలే ప్రఖ్యాత ఆంకాలజిస్ట్ డాక్టర్ నోరి దత్తాత్రేయుడుని రాష్ట్ర ప్రభుత్వం సలహాదారుగా నియమించిందని గుర్తు చేశారు. హైదరాబాద్ నగర ప్రజలకు రెండో అతిపెద్ద ఆసుపత్రిని అందుబాటులోకి తెచ్చినందుకు డాక్టర్ నాగేశ్వరరెడ్డికి అభినందనలు తెలుపుతూ డాక్టర్ నాగేశ్వరరెడ్డికి భారతరత్న వచ్చేందుకు కృషి చేస్తామని తెలిపారు. ప్రపంచ వ్యాప్తంగా దాదాపు 65 దేశాల నుంచి చికిత్స కోసం ఏఐజీ ఆసుపత్రికి వస్తున్నారంటే అది రాష్ట్రానికి గర్వకారణం. ఏఐజీ ఆసుపత్రి రూపొందించిన జననీ మిత్ర యాప్ వినియోగానికి సంబంధించి అధికారులను పంపించి అధ్యయనం చేయమని చెబుతామన్నారు. ప్రస్తుతం నర్సింగ్ ప్రొఫెషన్ కు జపాన్ దేశంలో మంచి డిమాండ్ ఉంది. అందుకే మన వాళ్లకు జపనీస్ ల్యాంగ్వేజ్ నేర్పించాలని నిర్ణయించాం. భారత్ వెనుకబడిన దేశం అన్న అభిప్రాయం నుంచి బయటకు తీసుకురావాలి. ప్రపంచంలోనే అనేక విషయాల్లో ఎన్నో విజయాలు సాధించిన చరిత్ర మనకున్నది అని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి వివరించారు.

# రైల్వే గేటు..తప్పని పాట్లు..!


**వేద న్యూస్, మెట్ పల్లి ప్రతినిధి :**

జగిత్యాల జిల్లా మెట్ పల్లి పట్టణ శివారులోని రైల్వే గేట్ వల్ల ప్రజల రాకపోకలకు తీవ్ర అంతరాయం ఏర్పడుతుందని వాహనదారులు, ప్రజలు మండిపడుతున్నారు. జాతీయ రహదారికి కూతవేటు దూరంలో ఉన్న రైల్వే గేట్ వల్ల నిత్యం రాకపోకలకు తీవ్ర ఇబ్బందులు ఏర్పడుతున్నాయని గంటల తరబడి వేచి చూడాల్సిన సమయం వస్తుందని తమ పనులకు అంతరాయం ఏర్పడుతుందని ప్రజలు వాపోయారు. ఈ రహదారి జిల్లాలకు సైతం అనుసంధానం ఉండడంతో వాహనదారులు భార్యలు తీరాల్సిన పరిస్థితి నెలకొంది. బ్రిడ్జి నిర్మాణం చేపట్టమని అధికారులకు, రాజకీయ నాయకులకు విన్నవించినప్పటికీ ఎటువంటి నిర్మాణం జరగలేదని ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ద్విచక్ర వాహనాలు, ఇతర చిన్న వాహనాలు వెళ్లడానికి బై పాస్ ఉన్నప్పటికీని ఆ దారి వర్షాల వల్ల నిత్యం బురదమయంగా మారుతుందని అన్నారు. అందువలన బీట్ రోడ్డు ఏర్పాటు చేయాలని ప్రజలు కోరుతున్నారు.






### కొమ్ముల వెంకటేష్



జగిత్యాల జిల్లా ఇబ్రహీంపట్నం మండలం అమ్మక పెట్ గ్రామ నివాసిని నా పేరు కొమ్ముల వెంకటేష్.మేము మెట్ పల్లి పట్టణానికి నిత్యం రాకపోకలు సాగిస్తుంటానని అన్నారు. ఈ రైల్వే గేట్ వల్ల రైలు వచ్చే సమయానికి గంటల తరబడి వేచి ఉండాల్సిన పరిస్థితి ఏర్పడి పనులకు తీవ్ర అంతరాయం జరుగుతుందని అన్నారు. ఎన్నిసార్లు అధికారులకు,రాజకీయ నాయకులకు తెలిపినప్పటికీ ఇప్పటికీ బ్రిడ్జి నిర్మాణము చేపట్టలేదు.

### మురళీ




మాకు ఏ అవసరం ఉన్న నిత్యం మెట్ పల్లికి రావాల్సిన పరిస్థితి. ఈ రైల్వే గేటు వల్ల రైలు వచ్చే సమయానికి సుమారు గంట ముందు గేటు వేయడంతో రైలు వెళ్లే వరకు వేచి చూడాల్సి వస్తుంది. అనేకమార్లు అధికారులకు తెలిపిన పట్టించుకునే వారే లేరు. ఇప్పటికైనా అధికారులు చొరవ చూపి రాకపోకలను సుగమం చేయాలి

## ప్రభుత్వ పాఠశాలలో మౌలిక సదుపాయాలు కల్పించాలి

**వేద న్యూస్,మిర్యాలగూడ ప్రతినిధి :**

ప్రభుత్వ పాఠశాలలలో మౌలిక సదుపాయాలు కల్పించాలని భారత విద్యార్థి ఫెడరేషన్ ఎస్ఎఫ్ఐ దామరచర్ల మండల కమిటీ ఆధ్వర్యంలో దామరచర్ల తహసిల్దార్ కి వినతి పత్రం ఇవ్వడం జరిగింది. అనంతరం ఎస్ఎఫ్ఐ దామరచర్ల మండల కార్యదర్శి వీరన్న నాయక్ మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలో వచ్చి రెండు సంవత్సరాలు కావస్తున్న పేద, మధ్యతరగతి కుటుంబాల నుంచి ప్రభుత్వ పాఠశాలలో చదువుకోవాలని విద్యార్థులు, విద్యార్థినిలు వస్తున్నారని,అనేక సమస్యలతో ఈ విద్యా సంవత్సరం వారికి స్వాగతం పలుకుతుందని అన్నారు. దామరచర్ల మండలంలో ఉన్న అన్ని ప్రభుత్వ పాఠశాలలో మౌలిక సదుపాయాలు లేక విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారు కావున వెంటనే అన్ని ప్రభుత్వ పాఠశాలలో సరిపడా బాత్రూం సౌకర్యం కల్పించాలని,తాగునీటి సౌకర్యం, ఆటవస్తులు అందించాలని అన్నారు. విద్యార్థులు అనేక సమస్యలను ఎదుర్కొంటున్నారు. ఇలాంటి సమస్యలు ప్రభుత్వ పాఠశాలలో కూరుకపోతే పేద మధ్యతరగతి విద్యార్థులు ఏరకంగా చదువుకుంటారు ప్రభుత్వ పాఠశాలలో అన్ని సౌకర్యాలు కల్పించాలని డిమాండ్ చేస్తూన్నమని,లేని పక్షంలో దామరచర్ల మండల కేంద్రంలో అన్ని ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థులతో కలిసి ధర్నాలు రాస్తారోకోలు నిర్వహిస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో మండల కమిటీ సభ్యులు అజయ్,విష్ణు,సాగర్,నాగ తదితరులు పాల్గొన్నారు.




-ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో ఎమ్మార్వో కు వినతి

## నకిలీ విత్తనాలు, పురుగు మందులు విక్రయించిన వ్యక్తిపై పీడీ యాక్ట్

**వేద న్యూస్, వరంగల్ క్రైమ్ :**




నకిలీ విత్తనాలు, పురుగు మందులు విక్రయించిన వ్యక్తిపై వరంగల్ పోలీస్ కమిషనర్ పీడీ యాక్ట్ ఉత్తర్వులు జారీ చేశారు. వరంగల్ పోలీస్ కమిషనరేట్ పరిధిలో నకిలీ విత్తనాలు, పురుగు మందులతో పాటు కాలం తీరిన పురుగు మందులను విక్రయించిన శాయిపేట్ కు చెందిన నూక రాజేష్ పై వరంగల్ పోలీస్ కమిషనర్ సన్ ప్రీత్ సింగ్ జారీ చేసిన పీడీ యాక్ట్ ఉత్తర్వులను మట్టెవాడ ఇన్స్ స్పెక్టర్ గోపి నిందితుడికి పరకాల జైలులో అందజేసి చర్లపల్లి జైలుకు తరలించారు. పీడీ యాక్ట్ అందుకున్న నిందితుడు మరో ఆరుగురు నిందితులతో కలసి ఒక ముఠా ఏర్పడి.. కాలం తీరిన పురుగు మందులను ఫర్టిలైజర్ డీలర్ల నుండి తక్కువ డబ్బుకు కొనుగోలు చేయడం తో పాటు నకిలీ విత్తనాలు, పురుగు మందులను రైతులకు విక్రయిస్తూ మట్టెవాడ పోలీసులకు గత నెల ఏప్రిల్ 7 వ తారీఖున నిందితుడిని అరెస్ట్ చేశారు. ఈ ముఠా నుండి పోలీసులు సుమారు 49 లక్షల52 వేల రూపాయల విలువ గల నకిలీ విత్తనాలు, పురుగు మందులను పోలీసులు స్వాధీనం చేసుకోవడం జరిగింది. నిందితుడు మరో మారు నెల 26వ తారీఖున నకిలీ పురుగు మందులు విక్రయిస్తుడడంతో మట్టెవాడ పోలీసులు మరో మారు అరెస్ట్ చేసి అతని నుండి 11వేల రూపాయల విలువ నకిలీ పురుగు మందులు స్వాధీనం చేసుకున్నారు. నిందితుడు గతంలో వరుస చైను స్నాచింగ్లకు పాల్పడుతున్న క్రమంలో మట్టెవాడ, సుబేదారి హన్మకొండ, కాకతీయ యూనివర్సిటీ పోలీస్ స్టేషన్ ల పరిధిలో ఏడు కేసులు నమోదు అయి అరెస్టు అయినాడు. సులభంగా డబ్బులు సంపాదించవచ్చు అని నకిలీ విత్తనాలు విక్రయానికి పాలుపడుతునట్లు సీపీ వెల్లడించారు. రైతులను మోసం చేస్తూ నకిలీ విత్తనాలు, పరుగు మందులను విక్రయిస్తే పీడీ యాక్ట్ క్రింద కేసులు నమోదు చేయబడుతుందని ఇదే క్రమంలో నేడు రెండవ పిడి యాక్ట్ నమోదు చేశారని అలాగే ఎవరైనా విక్రయిస్తే 7799848333 నంబర్ కు సమాచారం ఇవ్వాలని పోలీస్ కమిషనర్ తెలిపారు.

## బీసీల రిజర్వేషన్ల సాధన కోసం పోరాటం చేస్తాను

### - యాదవ చైతన్య వేదిక మహిళా విభాగం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి స్వప్న

**వేద న్యూస్, శంకరపట్నం :**



శంకరపట్నం మండలంలోని కన్నాపూర్ గ్రామానికి చెందిన బొబ్బిలి సప్న యాదవ్ ను యాదవ చైతన్య వేదిక మహిళా విభాగం రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా నియామకం చేసినట్లు, రాష్ట్ర అధ్యక్షులు గొర్ల అయిలేశ్ యాదవ్ ప్రకటించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, స్వప్న నిరంతరం యాదవుల,బీసీల సామాజిక,రాజకీయ చైతన్యం కోసం, వారి సమస్యల పరిష్కారం కోసం పోరాటం చేస్తున్నందున వారి సేవలను గుర్తించి స్వప్న ను నియామకం చేసినట్లు తెలిపినారు. నూతన ప్రధాన కార్యదర్శి స్వప్న మాట్లాడుతూ, తనపై నమ్మకంతో తమను యాదవ చైతన్య వేదిక మహిళా విభాగం రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా నియమించిన రాష్ట్ర అధ్యక్షులు గొర్ల అయిలేశ్ యాదవ్ కు, సహకరించిన వర్కింగ్ ప్రెసిడెంట్ అశోక్,ఉపాధ్యక్షులు పోచమల్లు, జిల్లా అధ్యక్షులు గొర్ల కొమురయ్యలకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేస్తూ,యాదవ చైతన్య వేదికను బలోపేతం చేయడానికి, యాదవుల, బీసీల సమస్యల పరిష్కారం కోసం తమవంతు కృషి చేస్తానని అన్నారు. బీసీల రిజర్వేషన్ల సాధనకై నిత్యం పోరాటం చేస్తానని ఈ సందర్భంగా ఆమె తెలిపారు.

Edited, Printed, Published and Owned by Lingabatthini Krishna Printed at Bhavani Enterprises, H.No 16-6-198/B, Perukawada, Warangal, 506002, Telangana State. Published at H.No. 17-3-180, Near Rama Swamy Temple, Warangal Dist, 506002 Telangana State. Editor : Lingabatthini Krishna, Phone : 9701923260. e-Mail : vedhanews22@gmail.com. RNI No : TELTEL/2022/83073